Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

శుక్రవారం 11/09/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఎదురెదురుగా ఢీకొన్న వ్యాను ట్రక్కు

⏭ ఆరుగురి మృతి



**టి మీడియా , సెప్టెంబర్ 10 , నాందేడ్ :** మహారాష్ట్రలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాందేడ్ జిల్లాలో ఓ ప్యాసింజర్ వ్యాను- ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. నాందేడ్- భోకర్ రహదారిపై సీతాఖండి సమీపంలో గురువారం సాయంత్రం 7 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయపడిని వాళ్లను చికిత్స కోసం స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రయాణికులతో ప్యాసింజర్ వ్యాన్ (టాటా మ్యాజిక్) నాందేడ్ నుంచి భోకర్ వెళ్తుంది. మార్గమధ్యలో సీతాఖండి ఘాట్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రక్కు, ఈ వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. ట్రక్కు వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో వ్యాన్ పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. స్థానికులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని, వ్యానులో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి అత్యవసర చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రజాసేవకులుగా పని చేద్దాం



⏭ కలెక్టర్ల సదస్సులో సీఎం దిశానిర్దేశం

**టి మీడియా , సెప్టెంబర్ 10 , అమరావతి బ్యూరో :** ఫైళ్లు పెండింగ్‌లో ఉంటే అభివృద్ధి, పాలన కూడా పెండింగ్‌లో ఉన్నట్టేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ మద్యం విధానం అక్రమాలను కలెక్టర్ల సదస్సులో సీఎం లేవనెత్తారు. వైఎస్సార్సీపీ హయాంలో మార్కెట్‌లోకి తెచ్చిన జే బ్రాండ్ కల్తీ మద్యం వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది ఆరోగ్యం దెబ్బతిందని ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన ఆ కల్తీ మద్యం బ్రాండ్లన్నింటినీ రద్దు చేసి ఇప్పుడు పారదర్శకంగా, నాణ్యమైన మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు జరుగుతోంది. సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్లు, మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, విభాగాధిపతులు హాజరయ్యారు. తొలి రోజు నాయకత్వం, రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ), తాగునీరు, గృహనిర్మాణం, జలధారతో పాటు జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాల పనితీరును మరింత మెరుగుపరిచే అంశాలపై సదస్సులో దిశానిర్దేశం చేశారు.

రూ.25,450 కోట్లు పెరిగిన జీఎస్టీ వసూళ్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రానికి ఉన్న అన్ని అవకాశాలను అన్‌లాక్ చేస్తూ ప్రతి శాఖలో సంస్కరణలు (మిగతా 2లో)

# బీఆర్ఎస్‌పైనే ప్రజల్లో వ్యతిరేకత ఉంది

⏭ ఫ్లాష్ సర్వేలో వెల్లడైందన్న రేవంత్ రెడ్డి

⏭ అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఎల్పీ సమావేశం



**టి మీడియా , సెప్టెంబర్ 10 , హైదరాబాద్ బ్యూరో :** ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాలని సభను నిర్వహిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్? సభను సజావుగా జరగకుండా కుట్ర చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో డిప్యూటీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

**సభ్యులకు సీఎం అభినందనలు**

అధికారం పోయినా అహంకారం వీడకుండా పోలీసు అధికారులను, ప్రజా ప్రతినిధులను దూషించి మూడు రోజులు సభను సజావుగా జరగకుండా చేశారని బీఆర్?ఎస్ నేతలను రేవంత్ రెడ్డి విమర్శించారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించడం, మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారని, శాసన సభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారని మండిపడ్డారు. నిరసన తెలిపేందుకు ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారని గుర్తు చేశారు. ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పి కొట్టి, ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజలకు తెలియజేసినందుకు సభ్యులకు సీఎం అభినందనలు తెలిపారు.సభ్యులు తప్పనిసరిగా సభలో చర్చల్లో పాల్గొనాలని, సభలో హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్?లో రాజకీయంగా రాణించలేరని, అందరికీ వెసులుబాటుగా ఉండాలని అత్యంత చారిత్రక భవనంలో (మిగతా 2లో)

## అర్హతలు లేకపోయినా 'ఆటోమెటిక్'గా పదోన్నతులు, ఇంక్రిమెంట్లు




⏭ దేవాదాయ శాఖలో అక్రమాల దందా!

**టి మీడియా , సెప్టెంబర్ 10 , హైదరాబాద్ బ్యూరో :** దేవాదాయ శాఖలో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ప్రమోషన్లు ఆలస్యమవుతున్నాయని సర్కారు ఇచ్చిన వరాన్ని వారు అవకాశంగా మలచుకున్నారు. అర్హతలు లేకపోయినప్పటికీ ప్రమోషన్లు, ఇంక్రిమెంట్ల ప్రయోజనాలను పొందారు. తద్వారా ఖజానాకు భారీగా కన్నమేశారు. దీనిపై ఉన్నతాధికారులు ప్రాథమిక విచారణలో నిగ్గుతేల్చడంతో ఈ వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వ కొలువుల్లో ఒకే స్థానంలో ఉంటూ ఖాళీ లేక పదోన్నతి పొందలేకపోవడం, ఏ అవకాశం పొందలేనటువంటి ఉద్యోగులకు ఆర్థికంగా ఊరటనిచ్చేందుకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ పథకాన్ని (ఏఏఎస్) ప్రవేశపెట్టారు. ఉమ్మడి ఏపీలో ప్రారంభమైన ఈ పథకం, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా సవరించిన వేతనాల నియమావళి ప్రకారం యథాతథంగా కొనసాగుతోంది.

**ఎలాగంటే?**

ప్రస్తుత రూల్స్ ప్రకారం, ఒకే కేడర్‌లో నిరంతరాయంగా ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకుంటే స్పెషల్ గ్రేడ్, 12 ఏళ్లకు ఎస్‌పీపీ-1ఏ, 18 ఏళ్లకు ఎస్‌పీపీ-1బి, 24 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లయితే ఎస్‌పీపీ-2 స్కేళ్లకు అర్హత లభిస్తుంది. కొంతమంది ఈవోలు టెంపుల్ ఎంప్లాయీస్‌గా ఉన్నప్పుడు కమిషనర్ ఉత్తర్వులు లేకుండానే ఈ పథకానికి అర్హులంటూ రికార్డులను సృష్టించి 150 నుంచి 300 శాతం పేస్కేళ్లను వర్తింపజేశారు. ఈ క్రమంలో నిబంధనలకు తప్పుగా క్లెయిమ్ చేసి, బేసిక్? పే (మూల వేతనం) పెంచుకుంటూ రూ.వేలల్లో అదనపు మొత్తాన్ని ప్రభుత్వ ఖజానా నుంచి డ్రా చేశారు.

**ఎలా వెలుగులోకి వచ్చిందంటే?**

ప్రాథమిక విచారణలో రూల్స్ ఉల్లంఘన జరిగినట్లు తేలడంతో (మిగతా 2లో)

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

⏭ మంత్రి పొన్నం ప్రభాకర్

**టి మీడియా , సెప్టెంబర్ 10 , హైదరాబాద్ బ్యూరో :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో టీజీఎస్?ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు పొన్నం ప్రభాకర్ సమాధానం ఇచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని అన్నారు. టీజీఎస్ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలను గత బీఆర్ఎస్? ప్రభుత్వం రద్దు చేసిందని, త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్మిక సంఘాల ఎన్నికలపై సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయని, కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వంలో విలీనమైనా ఏపీ ఆర్టీసీలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించామని పేర్కొన్నారు.



**347.47 కోట్ల మంది మహిళలకు ఉచిత ప్రయాణం**

హైదరాబాద్ నగరానికి వంద మినీ బస్సులు రాబోతున్నాయని మంత్రి ప్రకటించారు. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తామని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారని, ఇదొక రికార్డ్ అని పొన్నం వెల్లడించారు.

## టీవీకేకు ఎన్నికల సంఘం గుర్తింపు

⏭ ప్రజలకు విజయ్ కృతజ్ఞతలు

**టి మీడియా , సెప్టెంబర్ 10 , చెన్నై:** నటుడు నుంచి రాజకీయ నాయకుడిగా మారిన తమిళనాడు సీఎం జోసెఫ్ విజయ్ ఎన్నికల సంఘం కీలక గుర్తింపు ఇచ్చింది. ఆయన నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)ను తమిళనాడు, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాల్లో రిజిస్టర్డ్ రాజకీయ పార్టీగా ఈసీ గుర్తించింది. అంతేకాదు, పార్టీకి 'విజిల్' ఎన్నికల గుర్తును కేటాయించింది. ఈ పరిణామంపై సీఎం విజయ్? హర్షం వ్యక్తం చేశారు. పార్టీకి అండగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. టీవీకే రాజకీయ ప్రస్థానంలో ఇది కీలక మైలురాయిగా అభివర్ణించారు.రెండేళ్ల క్రితం ప్రారంభమైన టీవీకే, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఫలితాలను విజయ్ ప్రస్తావించారు. రాష్ట్ర రాజకీయాల్లో తమ పార్టీ ఎదుగుదలను అపూర్వ అద్భుతంగా అభివర్ణించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో 35 శాతం ఓట్లు రావడం ద్వారా టీవీకేను అతిపెద్ద పార్టీగా ప్రజలు నిలబెట్టారని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన ఈ తీర్పును గౌరవిస్తూ, ప్రజాస్వామ్య శక్తుల



సహకారంతో నిజాయితీ, అవినీతి రహిత పాలన అందించేందుకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో తమపై ప్రజల ఉంచిన నమ్మకాన్ని నిరంతర ప్రజాసేవ ద్వారా నిలబెట్టుకుంటాని తెలిపారు.

**'లౌకిక సామాజిక న్యాయమే మార్గం'**

రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తరించడంతో పాటు ప్రజలకు ఉపయోగపడే పాలన అందించడమే తమ లక్ష్యమని విజయ్? పేర్కొన్నారు. (మిగతా 2లో)

# పంచాయతీరాజ్ చట్టం సవరణ బిల్లు

⏭ క శాసనసభ ఆమోదం

**టి మీడియా , సెప్టెంబర్ 10 , హైదరాబాద్ బ్యూరో :** పంచాయతీల సొంత వనరుల ద్వారా వచ్చే ఆదాయం, ప్రభుత్వ ట్రెజరీలో కాకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70 లోని సబ్ సెక్షన్ 3ను సవరించేలా మంత్రి సీతక్క నిన్న ప్రవేశపెట్టిన బిల్లుపై ఇవాళ చర్చ జరిపి ఆమోదించింది.ప్రస్తుతం గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వస్తోంది. ఆ తర్వాత గ్రామ అవసరాలకు ఆ నిధులను వినియోగించుకోవాలంటే ట్రెజరీ ద్వారా నిధులను నిర్దిష్టమైన ప్రక్రియ ద్వారా డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. అనుమతులు, అవసరమైన పత్రాల వల్ల కొన్నిసార్లు నిధుల వినియోగంలో ఆలస్యం జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ఫైనాన్సు కమిషన్ నిధులను బ్యాంకు



ఖతాల్లో జమ అయినట్లుగానే జీపీ సొంత ఆదాయం కూడా బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చట్టాన్ని సవరిస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.

**కేంద్రం నుంచి రూ.619 కోట్లు రావాలి**

గ్రామపంచాయతీల కోసం ప్రతీ నెల ప్రభుత్వం 50 కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని సీతక్క తెలిపారు. ఎన్నికలు జరగకపోవడంతో నిలిచి పోయిన కేంద్ర నిధుల్లో ఇంకా రూ.619 కోట్లు రావాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీజీజీ రాంజీ పథకం వల్ల 2 వేల కోట్ల అదనపు భారం పడుతున్నప్పటికీ ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలను నిర్మిస్తున్నామని తెలిపారు. హ్యామ్ విధానంలో వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను నిర్మిస్తున్నామని సీతక్క తెలిపారు.

**స్థానిక సంస్థలు కొంత సంక్షోభంలో పడ్డాయి**

పంచాయతీ రాజ్ చట్ట సవరణపై మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. రెండేళ్లుగా 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్న మంత్రి సీతక్క ఎన్నికల తర్వాత పెండింగ్ నిధులు ఇప్పుడిప్పుడే విడుదల అవుతున్నాయని తెలిపారు. కేంద్రం నుంచి దాదాపు రూ.700 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉందని, స్టాంపుడ్యూటీని 2018లోనే తొలగించటం స్థానిక సంస్థలు కొంత సంక్షోభంలో పడ్డాయని (మిగతా 2లో)

# అక్రిడిటెడ్ కార్డుల మంజూరులో చీకటి దందా

- **33 జిల్లాల్లో లేనన్ని కార్డులు భద్రాద్రి కొత్తగూడెంలోనే ఎందుకు..?**
- **మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ**

**టి మీడియా , సెప్టెంబర్ 10 ,భద్రాద్రి కొత్తగూడెం:**
అక్రిడిటెడ్ కార్డుల మంజూరు వ్యవహారంలో పారదర్శకతకు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఐఎన్ఆర్ ప్యానెల్ నుంచి ఆమోదం పొందిన అర్హులైన అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టులకే కార్డులు మంజూరు చేయాలని మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ డిమాండ్ చేశారు.తెలంగాణలోని 33 జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు 750 నుంచి 800 వరకు అక్రిడిటెడ్ కార్డులు మంజూరు పై జిల్లా అధికారులు పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని ఆమె కోరారు. ఇంత భారీ సంఖ్యలో కార్డులు మంజూరు చేయడానికి అనుసరించిన నిబంధనలు, కమిటీ నిర్ణయాలు, అర్హతల పరిశీలనపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన దుర్గ.. అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులు అక్రిడిటెడ్ కార్డుల కోసం ఎదురుచూస్తుండగా, అనర్హులకు కార్డులు మంజూరయ్యాయన్న ఆరోపణలు రావడం ఆందోళనకరమన్నారు.

**‘డీవీ నెట్’తో సంబంధమేంటి...?**

కొత్తగూడెం రైల్వే స్టేషన్ సమీపంలోని రైతు మార్కెట్ ప్రాంతంలో ఉన్న డీవీ నెట్ సంస్థకు సంబంధించిన వ్యవహారంపై కూడా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని దుర్గ పేర్కొన్నారు. సుమారు 40 అక్రిడిటెడ్ కార్డుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచారన్న ఆరోపణలు ఉన్నాయని, పత్రికల సర్క్యులేషన్ కాపీలు, ఆన్‌లైన్ వివరాలను సేకరించి రెండుసార్లు సమర్పించినప్పటికీ కార్డులు ఎందుకు మంజూరు కాలేదో అధికారులు స్పష్టం చేయాలని అన్నారు.అంతేకాకుండా డీవీ నెట్ వద్దకు వెళ్లి వివరాలు అడిగిన వర్కింగ్ జర్నలిస్టులకు “రూ.30 వేల బిల్లుకు రూ.10 వేలు మాత్రమే ఇచ్చాను” అంటూ దురుసుగా సమాధానాలు ఇస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయని ఆమె తెలిపారు.“పౌర సంబంధాల శాఖకు చెందిన అక్రిడిటేషన్ ప్రక్రియలో ఒక ప్రైవేట్ డీవీ నెట్ సంస్థ పాత్ర ఏమిటి..? దానికి ప్రభుత్వం ఏదైనా అధికారిక బాధ్యత అప్పగించిందా..? అప్పగించి ఉంటే ఆ ఉత్తర్వులు ఎక్కడ ఉన్నాయి..?” అని వర్కింగ్ జర్నలిస్టులు ప్రశ్నిస్తున్నారని దుర్గ పేర్కొన్నారు. ప్రైవేట్ సంస్థ ద్వారా పత్రాల పరిశీలన జరుగుతున్నట్లయితే దానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, అనుమతులు, బాధ్యతలు, బిల్లులు, చెల్లింపుల వివరాలను బహిర్గతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

**‘కార్డులు అమ్ముతున్నారన్న ప్రచారం’పై విచారణ ఎప్పుడు...?**

అక్రిడిటెడ్ కార్డులు అక్రమంగా విక్రయిస్తున్నారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో దీనిపై



ఉన్నతస్థాయి విచారణ జరపాలని దుర్గ కోరారు.ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.. నిజం కాకపోతే ఆధారాలతో ఖండించాలి అని స్పష్టం చేశారు. కార్డుల మంజూరులో ఒక్క రూపాయి కూడా అక్రమ లావాదేవీలకు తావులేకుండా మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆమె అన్నారు.

**అటెండెన్స్ లేని పత్రికలకు కార్డులు ఎలా...?**

డీపీఆర్ఓ కార్యాలయంలో క్రమం తప్పకుండా అటెండెన్స్ నమోదు కాని పత్రికలకు అక్రిడిటెడ్ కార్డులు ఎలా మంజూరు చేశారో అధికారులు సమాధానం చెప్పాలని దుర్గ డిమాండ్ చేశారు. “ఎవరికి కార్డు ఇచ్చారు..? ఏ పత్రికకు ఇచ్చారు..? ఆ పత్రికకు అర్హత ఉందా..? కార్యాలయంలో అటెండెన్స్ ఉందా..? సర్క్యులేషన్ ఎంత..? నిబంధనల ప్రకారం ప్రచురణ జరుగుతోందా..?” అనే అంశాలపై పూర్తి స్థాయి ఆడిట్ నిర్వహించాలని కోరారు.“ఏ విషయం అడిగినా రెండో కమిటీ కూర్చుంది.. తీర్మానం అయింది.. అంటూ సమాధానాలు చెప్పడం సరైన విధానం కాదు. ఆ కమిటీలో ఎవరు ఉన్నారు..? ఏ నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకున్నారు..? ఎవరెవరికి కార్డులు మంజూరు చేశారు..? మొత్తం జాబితాను బహిర్గతం చేయాలి” అని ఆమె అన్నారు.

**ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కార్డులా...?**

ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న వ్యక్తి కుటుంబ సభ్యులకు అక్రిడిటెడ్ జర్నలిస్ట్ కార్డు మంజూరైందన్న ఆరోపణలపై కూడా విచారణ జరపాలని దుర్గ కోరారు.అదేవిధంగా బార్ షాపుల్లో పనిచేసేవారు, ఆటో డ్రైవర్లు, సెల్‌ఫోన్ రిపేర్ చేసేవారు తదితరులకు అక్రిడిటెడ్ కార్డులు మంజూరయ్యాయన్న ఆరోపణలు నిజమా కాదా అన్నది అధికారులు తేల్చాలని డిమాండ్ చేశారు.అర్హతలేని వ్యక్తులకు కార్డులు మంజూరు చేసినట్లు విచారణలో తేలితే వెంటనే వాటిని రద్దు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

**“అక్రిడిటెడ్ కార్డు అంటే ఆటబొమ్మ కాదు...!**

“అక్రిడిటెడ్ కార్డు అనేది నిజమైన వర్కింగ్ జర్నలిస్టుకు లభించే వృత్తిపరమైన గుర్తింపు. దాని విలువను తగ్గించే విధంగా అక్రమాలు జరిగితే అది ఒక్క జర్నలిస్టుకే కాదు.. మొత్తం జర్నలిస్టు సమాజానికే అవమానం” అని దుర్గ అన్నారు.అర్హత కలిగిన జర్నలిస్టులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు కార్డులు మంజూరయ్యాయన్న ఆరోపణలు రావడం వెనుక అసలు వ్యవహారం ఏమిటో తేల్చాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

**కలెక్టర్.. కమిషనర్ స్పందించాలి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అక్రిడిటెడ్ కార్డుల మంజూరుపై వస్తున్న ఆరోపణలన్నింటిపై జిల్లా కలెక్టర్ అంకిత్, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశించాలని పాల్వంచ దుర్గ కోరారు.మంజూరైన కార్డుల మొత్తం సంఖ్య, అర్హతలు, కమిటీ తీర్మానాలు, పత్రికల వివరాలు, అటెండెన్స్, సర్క్యులేషన్, పత్రాల పరిశీలన విధానం, ప్రైవేట్ సంస్థల ప్రమేయం తదితర అంశాలపై పూర్తి నివేదికను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.“అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం చేయాలి. అక్రిడిటేషన్ వ్యవస్థను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టకూడదు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో పౌర సంబంధాల శాఖపై పడుతున్న అనుమానాలకు అధికారులు స్వయంగా సమాధానం చెప్పాలి” అని పాల్వంచ దుర్గ డిమాండ్ చేశారు.

# స్కూల్‌కు సెలవు కోసం

- **తోటి విద్యార్థిని చంపేందుకు యత్నం**

**టి మీడియా , సెప్టెంబర్ 10 , అన్నమయ్య :**
స్కూల్‌లో తోటి విద్యార్థి చనిపోతే పాఠశాలకు సెలవు ప్రకటిస్తారని భావించారు. అంతటితో ఆగకుండా సెలవు కోసం తోటి విద్యార్థిని చంపేందుకు ప్రయత్నించిన ఇద్దరు విద్యార్థులకు సంబంధించిన ఘటన ఇది. అన్నమయ్య జిల్లాలోని కంభంవారిపల్లి మండలం గ్యారంపల్లెలోని గురుకుల పాఠశాలలో ఇద్దరు బాలురు 8వ తరగతి చదువుతూ వసతి గృహంలోనే ఉంటున్నారు. వారం క్రితం అర్ధరాత్రి వేళ వారు తమ గదిలోనే ఉన్న మరో విద్యార్థి ముఖంపై దిండుతో అదిమి, గొంతు నొక్కి చంపేందుకు యత్నించారు.

తప్పించుకుని బయటపడిన బాధిత విద్యార్థి బాధిత విద్యార్థి వారి నుంచి తప్పించుకుని బయటపడగా, ఈ విషయాన్ని ఉపాధ్యాయులు గోప్యంగా ఉంచారు. తర్వాత విషయం తెలిసి ఎంఈవో రెడ్డిబాషా బుధవారం పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను పిలిచి మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఇదే పాఠశాలలో ఒక విద్యార్థి చనిపోగా అప్పట్లో పాఠశాలకు సెలవు ఇచ్చారని, అందుకే సెలవు కోసం విద్యార్థిని చంపాలనుకున్నారని ఎంఈవో పేర్కొన్నారు. సదరు ఇద్దరు విద్యార్థులకూ టీసీలు ఇచ్చి పంపేశామని, విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించామని చెప్పారు.



**తల్లిదండ్రులదే బాధ్యత**

పిల్లల విషయంలో మొదటి ఐదు సంవత్సరాలు అత్యంత కీలకమైనవి. ఈ కాలంలోనే వారి మేధో వికాసం, శారీరక ఎదుగుదల, సమగ్రమైన దృఢమైన వికాసానికి పునాది పడుతుంది. సరైన ఆరోగ్య సంరక్షణ, రక్షణ, పోషకాహారం లభించినప్పుడు పిల్లలలో నేర్చుకునే సామర్థ్యం మరింత మెరుగ్గా ఉంటుంది. మానసిక స్థిరత్వాన్ని పెంపొందించే సామర్థ్యాన్ని అలవర్చడంలో తల్లిదండ్రులదే అత్యంత కీలకమైన బాధ్యత అని ఐక్యరాజ్యసమితికి చెందిన ‘యునిసెఫ్’ పేర్కొంది.

**మొదటి ఐదేళ్లు చాలా కీలకం**

తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య సరైన సంబంధాలు, పర్యవేక్షణ, అనుబంధం లేకపోవడం వల్ల పిల్లలలో ప్రవర్తనాపరమైన, భావోద్వేగ సమస్యలు పెరిగి, అవి మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపుతాయి. తల్లిదండ్రులు పంచుకునే ప్రతి కౌగిలి, ముద్దు, చేతితో తినిపించే ప్రతి ముద్ద, ఆట, పాట, నాణ్యమైన సమయం పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి దోహదపడతాయి.

# కల్లు దుకాణాలపై ఈగల్ టీం దాడులు..

- **45 బాక్సుల కల్లు సీసాలు స్వాధీనం!**

**టి మీడియా , సెప్టెంబర్ 10 , మెదక్ :**
మెదక్ జిల్లా తూప్రాన్‌లో కల్లు దుకాణాలపై ఈగల్ టీం ఆకస్మిక దాడులు కలకలం రేపాయి. కల్లు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు.. అక్కడ కల్లు సేవిస్తున్న వినియోగదారులకు డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో నలుగురికి డ్రగ్ పాజిటివ్‌గా తేలినట్లు అధికారులు గుర్తించారు. కల్లు డిపోలోనూ ఈగల్ టీం విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో సుమారు 45 బాక్సుల కల్లు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కల్లు నాణ్యత, అందులో నిషేధిత మాదక పదార్థాలు కలిపారా అనే కోణంలోనూ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇకఈగల్ టీం దాడుల సమయంలో కల్లు డిపో యజమాని, మేనేజర్ అక్కడ లేకుండా పరారీలో ఉన్నట్లు సమాచారం. దీంతో వారిని పట్టుకునేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది..డిపోలో లభించిన కల్లు సీసాలను స్వాధీనం చేసుకుని తదుపరి పరీక్షల కోసం నమూనాలు సేకరించే అవకాశం ఉంది..ఇక కల్లు తాగుతున్న వారిలో నలుగురికి



డ్రగ్ పరీక్షల్లో పాజిటివ్ రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ప్రాథమిక పరీక్షల ఫలితాలను నిర్ధారించేందుకు తదుపరి వైద్య/ల్యాబొరేటరీ పరీక్షలు అవసరమా, ఏ పదార్థానికి పాజిటివ్ వచ్చిందనే వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

మరో వైపు మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు అధికారులు తనిఖీలను ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో తూప్రాన్‌లో ఈ దాడులు ప్రాధాన్యత సంతరించు కున్నాయి. ఇటీవల తూప్రాన్ పట్టణంలోనూ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించి అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేసినట్లు సమాచారం. కల్లు డిపోలో స్వాధీనం చేసుకున్న సీసాల్లో కల్లు నాణ్యత ఎలా ఉంది? నిషేధిత పదార్థాల కల్తీ ఏమైనా జరిగిందా? డ్రగ్ పాజిటివ్ వచ్చిన నలుగురికి ఏ పదార్థం కారణమైంది? అనే అంశాలపై అధికారులు నిర్వహించే తదుపరి పరీక్షలతో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ప్రజాసేవకులుగా పని చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)
తీసుకొచ్చామని, ఆర్థిక ప్రగతిని ప్రతి నెలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. 2022-23ను బేస్ ఇయర్‌గా తీసుకుంటే ప్రస్తుత ధరల ప్రకారం 13.44 శాతం వృద్ధి నమోదైందని, జీఎస్టీ వసూళ్లు గతేడాదితో పోలిస్తే రూ.25,450 కోట్లు పెరిగాయని వెల్లడించారు. వనరులు, టెక్నాలజీ ఉన్నా కొన్ని చోట్ల లోపం ఉందన్న సీఎం, రియాక్టివ్ గవర్నెన్స్‌కు స్వస్తి చెప్పి ప్రోయాక్టివ్ గవర్నెన్స్ అందించాలని అధికారులను ఆదేశించారు. ఇగోలు పక్కనపెట్టి ప్రజా సేవకులుగా పని చేద్దామంటూ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. 27 నెలల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టి, సంక్షేమానికి రూ.1.40 లక్షల కోట్లు, అభివృద్ధికి రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్-1, పోలవరం ఎడమ కాలువ, భోగాపురం విమానాశ్రయం వంటి కీలక ప్రాజెక్టులు పూర్తి చేశామని, పోలవరాన్ని 2027 మార్చి నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. నీటి భద్రత, సాగునీటి రంగంలో చేస్తున్న కృషికి ‘వాటర్‌మ్యాన్’గా గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్న సీఎం, రాష్ట్ర ప్రగతి వెనుక మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషి ఉందని స్పష్టం చేశారు.ఫేక్ ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ కుట్రలకు అధికారులు వేగంగా కౌంటర్ ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాల్లో ఎలాంటి తప్పు జరగలేదని, స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారమే ఉద్యోగాలు ఇచ్చామని తేల్చిచెప్పారు.

# బీఆర్ఎస్‌పైనే ప్రజల్లో వ్యతిరేకత ఉంది

(మొదటి పేజీ తరువాయి)
శాసన మండలి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అసెంబ్లీలో సెంట్రల్ హాల్?ను ప్రారంభించుకుని దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని గుర్తు చేశారు. సభలో నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు ప్రస్తావించాలని, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎదిగి కాంగ్రెస్?కు నష్టం చేకూర్చాలని కొందరు చూస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీత లక్ష్మా రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కేటీఆర్?కు రేవంత్ రెడ్డి కనిపించినట్టున్నారని ఎద్దేవా చేశారు. అంత ఆక్రోశంతో అధికారులపై దాడులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అర్హతలు లేకపోయినా ‘ఆటోమెటిక్’గా పదోన్నతులు, ఇంక్రిమెంట్లు

(మొదటి పేజీ తరువాయి)
తొలుత అక్రమంగా లబ్ధి పొందినట్టు భావించిన 12 మంది ఉద్యోగులకు సంబంధించిన ఫైళ్లను సమగ్రంగా పరిశీలించాలని శాఖలోని ఆర్థిక విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అధికారులు ఆ ఉద్యోగుల సర్వీస్ రికార్డులను(ఎస్ఆర్) లోతుగా పరిశీలించి అవకతవకలు నిజమేనని నిర్ధారించారు. ఒకరు మినహా 11 మంది రికార్డుల్లో మార్పులు ఉన్నాయని రిపోర్ట్? ఇచ్చారు. ఇందులో భాగమైన వారి సంఖ్య భారీగానే ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని యోచిస్తున్నారు. హెడ్? క్వార్టర్?లో ఓ ఉన్నతాధికారి ఈ విషయంలో జోక్యం చేసుకొని విచారణను ఆపాలని ప్రయత్నిస్తున్నట్టుగా సమాచారం.

**అధికారుల అలసత్వం**

ఏ ప్రభుత్వ శాఖలోనైనా శాలరీలు ఫిక్సేషన్ చేసేటప్పుడు పరిశీలించాల్సిన బాధ్యత ఆయా ఆఫీస్?ల సూపరింటెండెంట్లు, అకౌంట్స్ అధికారులు, బిల్లులు పాస్ చేసే ట్రెజరీ/ఆడిట్ అధికారులపై ఉంటుంది. కానీ వారి అలసత్వం, పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ తప్పులు ఏళ్ల తరబడి సాగాయని తెలుస్తోంది. ఇంటర్నల్ ఆడిట్ సక్రమంగా జరగకపోవడం, సర్వీస్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించకుండా పైపైన చూసి సంతకాలు చేయడం వీరికి వరంగా మారింది.

**ఏజీ ఆఫీస్ పాత్ర కీలకం**

ఈ వ్యవహారంలో ‘ఏజీ ఆఫీస్’ పాత్ర కీలకంగా మారింది. ఉద్యోగులకు ఏఏఎస్ మంజూరు చేసినప్పుడు కొత్త వేతన స్థిరీకరణ ఫైళ్లను ఏజీ కార్యాలయానికి ఆడిట్‌కు పంపి క్లియరెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతి ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ఏజీ ఆఫీస్ బృందాలు జరిపే వార్షిక తనిఖీల్లో ఇలాంటి అవకతవకలను గుర్తించి ‘ఆడిట్ అబ్జెక్షన్’ను నమోదు చేస్తాయి. దేవాదాయ శాఖలోని ఈ అక్రమాలు ఇలాంటి తనిఖీల్లోనే బయటపడినట్లుగా సమాచారం. అక్రమాలకు పాల్పడిన ఉద్యోగుల్లో ఎవరైనా పదవీ విరమణకు సిద్ధంగా ఉన్నట్లయితే పెన్షన్, గ్రాట్యుటీ తదితర ప్రయోజనాలను పూర్తిగా నిలిపివేస్తుంది.

# పంచాయతీరాజ్ చట్టం సవరణ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)
చెప్పారు.

**గ్రామ పంచాయతీ భవనాలను నిర్మిస్తున్నాం**

గ్రామ పంచాయతీలకు ప్రతినెలా రూ.54 కోట్లు విడుదల చేస్తున్నామన్న మంత్రి సర్పంచ్‌లకు పెండింగ్ ఉన్న నిధుల్లో పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఏమీ లేవని స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేల ఫండ్స్ పనులు చేసి పంచాయతీరాజ్‌శాఖను అడుగుతున్నారని తెలిపారు. వివాదాల వల్ల ఎన్నికలు జరగని గ్రామాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే నిధులు ఇస్తోందని సభకు వివరించారు.గ్రామపంచాయతీలకు సహకార బ్యాంకుల్లో నిధులు జమచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బీజేపీ సభ్యులు పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయ రమణరావు, శంకర్ తదితరులు చర్చలో పాల్గొని సూచనలు ఇచ్చారు.

# భార్యాపిల్లలు లేని జీవితం నాకు వద్దు

- **మనస్తాపంతో ఉరేసుకున్న భర్త**

**టి మీడియా , సెప్టెంబర్ 10 , అమరావతి బ్యూరో :**
అప్పుల బాధతో భార్య, ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితుడిగా ఉన్న భర్త జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన కొద్ది రోజులకే బలవన్మరణానికి పాల్పడ్డాడు. భార్యాపిల్లలు లేరనే మనస్థాపంతోనే అతను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు ప్రేమించి పెళ్లాడిన భార్య, పిల్లలను కోల్పోయి, చివరకు అతను కూడా ప్రాణాలు విడవడంతో ఆ కుటుంబం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. క్షణికావేశం, బాధ్యతారాహిత్యం ఒక నిండు సంసారాన్ని ఎలా బూడిద చేస్తాయో చెప్పడానికి ఈ ఘటనే ఒక సజీవ సాక్ష్యం.

## టీవీకేకు ఎన్నికల సంఘం గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)
పారదర్శక పాలన, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజా సంక్షేమం తమ ప్రభుత్వ విధానాల్లో కీలకంగా ఉంటాయని స్పష్టం చేశారు. టీవీకే రాజకీయ సిద్ధాంత మార్గంలో లౌకిక సామాజిక న్యాయంకు ప్రాధాన్యత ఉంటుందని విజయ్ తెలిపారు.

# వినాయక చవితి వేడుకలపై పోలీసుల అవగాహన




**టీ మీడియా, సెప్టెంబర్ 10 , ముదిగొండ:** వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు, డీజే నిర్వాహకులతో ముదిగొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాల ఏర్పాటు, మండపాల వద్ద నిర్వహించే కార్యక్రమాలు, నిమజ్జనం తదితర అంశాలపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునే వారు ముందస్తుగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పోలీసుల అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. మండపాల వద్ద నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాలని తెలిపారు.అలాగే డీజేల ఏర్పాటు పూర్తిగా నిషేధించబడిందని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. విగ్రహాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు పోలీసుల సూచనలు, నిబంధనలు పాటిస్తూ సహకరించాలని సూచించారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి వినాయక చవితి వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని పోలీసులు కోరారు.

# నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరి



**⏭ అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి**

**టి మీడియా , సెప్టెంబర్ 10 , ఖమ్మం:** వానాకాలం సీజన్ 2026–27లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులు, ధాన్యం రవాణా కాంట్రాక్టర్లు, గోదాముల నిర్వాహకులతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల సన్నాహకాలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూలి జిల్లా వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం ఈ సీజన్‌లో సుమారు 2.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు, గోదాములు, రవాణా తదితర అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. అక్టోబర్ 1, 2026 నుంచి జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ముందస్తుగా అవగాహన

రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ముందు తప్పనిసరిగా శుభ్రపరచుకునేలా రైతు వేదికలు, వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ధాన్యంలో నిర్దేశిత తేమ శాతం వచ్చిన తర్వాతే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని రైతులకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.

సిబ్బంది, శిక్షణ

ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పంచాయతీ నుంచి ఒక సిబ్బందిని నియమించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కేంద్రం ఇన్‌చార్జికి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, నాణ్యతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలపై పూర్తి స్థాయి అవగాహన ఉండేలా అవసరమైన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి మూడు మండలాలకు ఒక శిక్షణా సమావేశం చొప్పున నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు.

గోదాముల స్థలాలనుముందుగానే సిద్ధం చేయాలి

కొనుగోలు చేసిన ధాన్యాన్ని అధికారికంగా గుర్తించిన గోదాములకు మాత్రమే తరలించాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లాలో అవసరమైన గోదాముల స్థలాలను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం రవాణా చేసే ప్రతి వాహనానికి జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణ పరికరాలను ఏర్పాటు చేయాలని ధాన్యం రవాణా కాంట్రాక్టర్లకు సూచించారు.ఈ సమావేశంలో సహాయ పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారులు, మెప్మా, మార్క్‌ఫెడ్, తూనికలు కొలతల శాఖ, రవాణా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రియల్టర్ రామ్ రెడ్డి ఆత్మహత్య..



**⏭ సూసైడ్ నోట్‌లో సంచలన విషయాలు..!**

**టి మీడియా , సెప్టెంబర్ 10 , రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, హోమ్ ల్యాండ్ సంస్థ అధినేత బాణాల రామ్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కందుకూరు మండలం నేదునూరు గ్రామంలోని తన ఫామ్‌హౌస్‌లో ఉరివేసుకుని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా లభించిన సూసైడ్ నోట్ ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు పోలీసులు.రామ్‌రెడ్డి కొంతకాలంగా హైదరాబాద్‌లోని మణికొండలో నివాసముంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. 2018లో పటాన్‌చెరువు ప్రాంతంలో సుమారు 250 ఎకరాల భూమిని డెవలప్‌మెంట్ కోసం తీసుకుని వెంచర్ చేపట్టినట్లు సమాచారం. అయితే ఆ భూమికి సంబంధించిన వివాదాలు, లిటిగేషన్ల కారణంగా వెంచర్ అభివృద్ధి ఆలస్యమైనట్లు తెలుస్తోంది. వివాదాలను పరిష్కరించేందుకు భారీగా అప్పులు చేసినట్లు, మరోవైపు భూ యజమానులతో కూడా సమస్యలు తలెత్తినట్లు ప్రాథమిక సమాచారం. వెంచర్ ఆలస్యం కావడంతో ఆర్థిక భారం పెరిగి తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది.రామ్‌రెడ్డి రాసినట్లుగా భావిస్తున్న సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. ఈ ఘటనపై కందుకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. రామ్‌రెడ్డి ఆత్మహత్యకు అసలు కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# మైక్రోసాఫ్ట్ ఆధ్వర్యంలో ఏఐ ఎక్స్‌పో




**టి మీడియా , సెప్టెంబర్ 10,ఖమ్మం రూరల్ :** ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల అటానమస్‌లో మైక్రోసాఫ్ట్ ఆధ్వర్యంలో ఏఐసీడబ్ల్యూ 2.0 క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రతిబింబించేలా రూపొందించిన పలు వినూత్న ప్రాజెక్టులు, నమూనాలు మరియు ఆలోచనలను ప్రదర్శించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కేటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ, విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని ఆచరణలో పెట్టి వినూత్న పరిష్కారాలను రూపొందించడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి ప్రాజెక్ట్ ఎక్స్‌పోలు విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలు, ఆత్మవిశ్వాసం మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులు తమ ఆలోచనలను ఆవిష్కరణలు మరియు స్టార్టప్‌లుగా అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు.ప్రిన్సిపాల్ డా. బత్తుల గోపాల్ మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ అవసరాలకు అనుసంధానం చేస్తూ రూపొందించిన ప్రాజెక్టులు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయని అన్నారు. ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, బృంద స్ఫూర్తి మరియు నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.ఎడ్యునెట్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రైనర్ రాపాక మనోజ్ కుమార్ మాట్లాడుతూ గత 45 రోజుల పాటు విద్యార్థినులకు ఏఐ, మెషిన్ లెర్నింగ్‌కు సంబంధించిన వివిధ అంశాలను సమగ్రంగా బోధించారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు తమ అనుభవాలను పంచుకుంటూ, 45 రోజుల శిక్షణ తమకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని తెలిపారు. ప్రారంభంలో క్లిష్టంగా అనిపించిన ఏఐ, మెషిన్ లెర్నింగ్ అంశాలను ట్రైనర్ అందించిన సులభమైన వివరణలు, నిరంతర మార్గదర్శకత్వం మరియు ప్రాక్టికల్ శిక్షణ ద్వారా సులభంగా అర్థం చేసుకున్నామని చెప్పారు. ముఖ్యంగా రియల్–వరల్డ్ అప్లికేషన్లపై శిక్షణ తమలో సాంకేతిక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, ఆత్మవిశ్వాసం మరియు కెరీర్‌పై స్పష్టతను పెంపొందించిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సుమారు 184 మంది విద్యార్థినులు పాల్గొని ఆధునిక ఏఐ––మెషిన్ లెర్నింగ్ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు దాని ఆచరణాత్మక అనువర్తనాలపై విలువైన అనుభవాన్ని పొందారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థినులకు ఎడ్యునెట్ ఫౌండేషన్ సర్టిఫికెట్లను అందజేశారు.అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకట రమణ మాట్లాడుతూ, విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంతో పాటు వాటిని ఆచరణలో పెట్టి సమాజానికి ఉపయోగపడే పరిష్కారాలను రూపొందించాలని సూచించారు. ఇలాంటి ప్రాజెక్ట్ ప్రదర్శనలు విద్యార్థుల్లో పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వినూత్న ప్రాజెక్టులు ఏఐసీడబ్ల్యూ 2.0 క్యాప్‌స్టోన్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ప్రాజెక్టుల ప్రదర్శన విద్యార్థుల్లోని సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం మరియు ఆచరణాత్మక పరిజ్ఞానాన్ని ప్రతిబింబించింది.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తివారి మన్మోహన్, ఎడ్యునెట్ ప్రతినిధులు, ట్రైనర్ రాపాక మనోజ్ కుమార్ విద్యార్థినులు పాల్గొన్నారు. ఏఐసీడబ్ల్యూ 2.0 ద్వారా విద్యార్థినులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి, భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు వారిని సన్నద్ధం చేయడంలో ఈ కార్యక్రమం విజయవంతమైంది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులు, ట్రైనర్ మరియు విద్యార్థినులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**⏭ జిల్లా కలెక్టర్ అంకిత్**

**టి మీడియా , సెప్టెంబర్ 10,చంద్రుగొండ :** మండలం సీతాయిగూడెం గ్రామంలో కొనసాగుతున్న భూ రీ–సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న సర్వే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, సర్వే ప్రక్రియను వేగవంతంగా, పూర్తి ఖచ్చితత్వంతో చేపట్టాలని ఆదేశించారు. గ్రామ పరిధిలో మొత్తం 1,823 ఎకరాలకు భూ రీ–సర్వే నిర్వహించాల్సి ఉండగా, ప్రస్తుతం గ్రామ సరిహద్దుల నిర్ధారణతో పాటు భూముల వివరాల పరిశీలన కొనసాగుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇటీవల గ్రామ సభను కూడా నిర్వహించామని, అన్ని శాఖల సమన్వయంతో రీ–సర్వే ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు.గ్రామంలో సుమారు 200 వరకు నివాసాలు ఉన్నట్లు అధికారులు వివరించగా, భూమి ఉన్నప్పటికీ పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు, పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో భూమి వివరాలు సరిపోని వారు, రికార్డుల్లో భూముల వివరాలు నమోదు కాని సందర్భాలు కూడా ఉన్నట్లు తెలిపారు. భూ రీ–సర్వే పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితిని గుర్తించి, రికార్డుల్లో అవసరమైన సవరణలు చేయడంతో పాటు అర్హులైన భూహక్కుదారులకు పాస్‌బుక్‌లు పొందే అవకాశం కలుగుతుందని అధికారులు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ గ్రామంలోని గిరిజనులతో నేరుగా మాట్లాడి భూ రీ–సర్వే వల్ల వారికి కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. రీ–సర్వే ప్రక్రియ గిరిజన రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు కలెక్టర్‌కు తెలిపారు. గతంలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా భూములకు సంబంధించిన రికార్డుల సవరణలు, ఇతర ప్రక్రియలు పూర్తి చేసుకోలేకపోయిన వారికి ప్రస్తుత రీ–సర్వే ప్రక్రియ ద్వారా మేలు జరుగుతుందని చెప్పారు. పాత భూ రికార్డులను



పరిశీలించి, క్షేత్రస్థాయిలో ఉన్న భూములను గుర్తించడం ద్వారా తమ భూ హక్కులకు మరింత స్పష్టత లభిస్తుందని గిరిజనులు పేర్కొన్నారు.గ్రామ పరిధిలో అటవీ భూములు కూడా గణనీయంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెద్దగూడెం ఫారెస్ట్ బ్లాక్ పరిధిలో సుమారు 5,000 హెక్టార్ల అటవీ ప్రాంతం ఉండగా, సీతాయిగూడెం గ్రామ పరిధిలో సుమారు 700 నుంచి 800 ఎకరాల వరకు అటవీ భూమి ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రాంతం రామవరం, చంద్రుగొండ తదితర అటవీ రేంజ్‌ల పరిధిలో ఉన్నట్లు అధికారులు వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాత భూ రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించారు. సుమారు 1920ల నాటి పాత మ్యాప్‌లు, రికార్డులను పరిశీలిస్తూ అప్పటి భూముల హద్దులు, చెట్లు, కుంటలు, చెరువులు, తోటలు తదితర వివరాలను నమోదు చేసిన విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అప్పట్లో ఏర్పాటు చేసిన భూ హద్దు రాళ్లు ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో కనిపించడం లేదని అధికారులు వివరించగా, భూ రీ–సర్వేలో హద్దులను స్పష్టంగా నిర్ధారించి, భవిష్యత్‌లో కూడా సులభంగా గుర్తించే విధంగా శాశ్వత హద్దు గుర్తులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.భూ రీ–సర్వే ద్వారా భూముల వాస్తవ విస్తీర్ణం, హద్దులు, సర్వే నంబర్లు, పట్టాదారు వివరాలు తదితర అంశాలను పాత రికార్డులతో సరిపోల్చి ఖచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూమి ఉండి రికార్డుల్లో నమోదు కాకపోవడం, పాస్‌బుక్ ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో భూమి వివరాలు లేకపోవడం వంటి సమస్యలను గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఏ ఒక్క అర్హుడి భూమి వివరాలు కూడా రికార్డుల్లో తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రీ–సర్వే ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ జగదీశ్వర ప్రసాద్, సర్వే అధికారులు, అటవి శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ‘పిల్లలను జాగ్రత్తగా చూసుకో..’

**⏭ అంటూ సూసైడ్ నోట్!**

**⏭ బెట్టింగ్ భూతానికి భర్త బలి**

**టి మీడియా , సెప్టెంబర్ 10 , అశ్వరావుపేట ;** పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పి..సూసైడ్ నోట్ రాసి భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు లో బెట్టింగ్ భూతానికి ఓ వ్యక్తి బలైన ఘటన చోటుచేసుకుంది. బూర్గంపాడు లో మటన్ వ్యాపారం నిర్వహించే నాగేశ్వరరావు (40) అనే వ్యక్తి గత కొంతకాలంగా బెట్టింగులకు పాల్పడి భారీగా డబ్బులు పోగొట్టుకొని ఆర్థికంగా నష్టపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు.

అశ్వరావుపేట మండలం ఆసుపాక కు చెందిన ఓ వ్యక్తి ప్రోత్బలంతో తాను బెట్టింగులకు పాల్పడ్డానని సూసైడ్ నోట్ లో పేర్కొన్నాడు. దీంతో భారీగా నష్టపోయానని, తన చావుకు కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని, తాను డబ్బులు పంపిన ఫోన్ పే నెంబర్లను వివరాలతో సహా మృతుడు సూసైడ్ నోట్ లో రాశాడు.

గతంలో కూడా మృతుడు నాగేశ్వరరావు బెట్టింగుల కోసం చేసిన 80 లక్షల రూపాయల అప్పులను తండ్రి తీర్చినట్లుగా చెప్తున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తన భార్యకు ఫోన్ చేసి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పి ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు అతని కోసం గాలిస్తుండగా ఊరి శివారులో ఓ షెడ్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. దీంతో



గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# వీరనారి చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి సి పీ ఎం



**టీ మీడియా, సెప్టెంబర్ 10 ,పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని హమాలీ సంఘం ఆధ్వర్యంలో వీరవనిత చిట్యాల ఐలమ్మ వర్ధంతి సభ ఆర్ భాస్కర్ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా మండ్లరాజు సిపిఎం మాజీ ఎంపీటీసీ జి బాలయ్య మాట్లాడుతు భూమి భుక్తి వెట్టి చాకిరి విముక్తి కొరకు దోపిడీ పీడన అంటరానితనం కుల వివక్షకు వ్యతిరేకంగా దున్నేవాడికే భూమి కావాలని జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దేశ్ముఖ్ దొరలు పటేల్ పట్వారిలా నియంతృత్వ పోకడలను వ్యతిరేకిస్తూ పేద ప్రజలందరికీ దున్నే వారికి భూమి కావాలని గొప్ప యోధురాలని అన్నారు ఆంధ్ర మహాసభ సంఘం పిలుపునందుకొని నాయకుల ఆలోచన స్ఫూర్తితో సాయుధ పోరాటంతో భూమి భక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం ప్రపంచం మెచ్చిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందని అలాంటి పోరాటాన్ని మతోన్మాదులు హిందువులకు ముస్లింలకు జరిగిన కొట్లాటగా వక్రీకరిస్తున్నారని ఇలాంటి వక్రీకరణలు ప్రజలు నమ్మవద్దని అన్నారు తెలంగాణలో 3500 గ్రామ స్వరాజ్యాలు 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచడం సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటంలో 4వేల మంది ప్రాణాలను అర్పించడం ఈ మహత్తర పోరాటం కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిందని అన్నారు ఈ పోరాటంతో దళితులు గిరిజనులు వెనుకబడిన ముస్లింలు పేదలు చైతన్యమయి అనేక హక్కులు పొందాలని అన్నారు కమ్యూనిస్టుల నాయకత్వం పోరాటంతోనే ఈ గడ్డ విముక్తి పొందిందని మహత్తర తెలంగాణ రైతంగా సాయుధ పోరాటం క్రెడిట్ అంతా కమ్యూనిస్టులకే దక్కుతుందని ఇందులో మతోన్మాదులకు ఎలాంటి పాత్ర లేదని అన్నారు చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో రాబోయే కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల పైన పోరాటాలు జరుగుతాయని ప్రజలందరూ పోరాటాలలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో హమాలి సంఘం అధ్యక్షులు ఆంజనేయులు పెద్ద మన్యం రామస్వామి సురేశ్ వెంకటేష్ చెన్నయ్య నరసింహ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు షూ, యూనిఫాం పంపిణీ చేసిన సర్పంచ్

## సౌకర్యాల కల్పనకు సర్పంచ్ హామీ



**టీ మీడియా,సెప్టెంబర్10,సింగరేణి(కారేపల్లి):** మండల కేంద్రంలోని సింగరేణి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు షూ,యూనిఫాం దుస్తులను సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) గురువారం పంపిణీ చేశారు.పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన యూనిఫాం దుస్తులు,షూలను సర్పంచ్ చేతుల మీదుగా అందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ టోనీ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.పేద కుటుంబాలపై విద్యాభారం పడకుండా ప్రభుత్వం విద్యార్థులకు పుస్తకాలు,యూనిఫాంలు,షూలు అందించడంతో పాటు అల్పాహారం,మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలతో విద్యను ప్రోత్సహిస్తోందన్నారు. విద్యారంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో సింగరేణిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి,ఉపాధ్యాయుడు ఎండీ జాకీర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థినికి ఐ టి డి ఏ పి ఓ ప్రశంసలు



**టీ.మీడియా,సెప్టెంబర్10,చింతూరు:** చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ తన కార్యాలయంలో ఇటీవల నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంక్ సాధించి, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ గుంటూరు లో ఎంబీబీఎస్ సీట్ సాధించిన కుమారి. కాక వర్షిణి ప్రియ ను పిలిపించి మాట్లాడారు . ఎంబీబీఎస్ సీటుసాధించినందుకు ప్రశంసించారు.'ఏజెన్సీ ప్రాంతంలో విద్య, వైద్యం నిరుపేదలకు మరింత చేరువ చెయ్యాలంటే ఏ విధమైన సూచనలు ఇవ్వగలరు ' అని అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీ ప్రాంతంలో మెరుగైన వైద్యసేవలు అందించుటకు.. నా వంతు కృషి చేస్తానని వర్షిణి ప్రియ హామీ ఇచ్చారు. అనంతరం వర్షిణి ప్రియను ప్రాజెక్ట్ అధికారి దుస్సాలువతో సన్మానించి, ప్రతిష్టాత్మక "చింతూరు సేవా సమ్మాన్" పురస్కారంతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో రామతులసి గారు,తల్లిదండ్రులు కాక రాజు,పూజిత, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కణితి శేఖర్,రాష్ట్ర నాయకులు సోడే నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారంలో చోరీ కలకలం





**టీ.మీడియా.సెప్టెంబర్10. ముదిగొండ :** ముత్తారం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోరీ ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కాలపొంగు శ్రీను ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి వెండి, బంగారం, నగదును అపహరించినట్లు సమాచారం.కుటుంబ సభ్యులు ఇంటి బయట వరండాలో నిద్రిస్తుండగా, గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది.ఈ ఘటనలో సుమారు 40 తులాల వెండి, రెండు పుస్తెలు కలిపి 8 గ్రాముల బంగారం, రెండు ఉంగరాలు కలిపి 4 గ్రాముల బంగారం, రూ.30 వేల నగదు అపహరణకు గురైనట్లు సమాచారం.బంగారం, వెండి విలువతో కలిపి చోరీకి గురైన మొత్తం సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.చోరీ విషయాన్ని బాధితులు పోలీసులకు సమాచారం అందించారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# నిందారోపణల కొరకే నా అసెంబ్లీ



**టీ మీడియా ,సెప్టెంబర్ 10 ,అమరచింత:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు పడక సాగునీరు,తాగునీరు రైతులు కరెంట్ కష్టాలతో ఇబ్బంది పడుతుందోన్న పట్టించుకోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్ర అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమ్యసలను చర్చించకుండా ఒకరి పై ఒకరు దుర్భాషలాడుతూ సభ గౌరవాన్ని మంట గలుపుతున్నారు .ఇదంతా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామిలను విస్మరించి ప్రజాసమస్యలను పట్టించుకోకుండా ప్రజలను తప్పు దోవ పటించడానికి కాంగ్రెస్ ఆడుతున్న నాటకం. రాష్ట్రంలో సరైన సమయానికి రైతులు వేసిన పంటలు ఎండిపోయ్ని, రైతులు అప్పుల పాలై , రైతులు ఆత్మహత్య చేసుకునే స్థాయికి రైతుల పరిస్థితి వచ్చింది.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వన్నీ చూస్తూ కూడా రైతు పంట భీమాను, రైతు బీమా, రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించలేదు. దానితో రైతులకు తీవ్ర నష్టం కలిగించింది.విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు,రైతులకు ,విద్యార్థులకు,యువకులకు ,రిటైర్డ్ ఉద్యోగస్తులకు ,మహిళలు,చేతి వృత్తి వాళ్ళు పడుతున్న ఇబ్బందులను అసెంబ్లీ లో చర్చించకుండా ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీలు ఒకరి పై ఒకరు నిందలు మోపుకుంటూ ఓటు బ్యాంక్ రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ రాబోయే కాలంలో కాంగ్రెస్ బి ఆర్ ఎస్ పార్టీలకు సరైన సమయంలో బుద్ధి చెబుతారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మెర్వ రాజు అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్స్ వీధ విష్ణు. ఉషన్న,చేనేత సహకార సంఘం కార్యదర్శి మేర్వ అనిల్,డైరెక్టర్ లు తిరుమల రఘు, ఎంకంపల్లి శ్రీను , సీనియర్ బీజేపీ నాయకులు క్యామ భాస్కర్ దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి గొల్ల శ్రీనివాసులు,విజయ్ యాదవ్,చాకలి రవి,మంగ అనిల్.ఉదయ్ సోషల్ మీడియా కొంగరీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు



**టీ మీడియా ,సెప్టెంబర్ 10 ,ఆత్మకూర్:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ముట్టడిలో భాగంగా వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులను ముందస్తుగా ఆత్మకూర్ పోలీస్ స్టేషన్లో అరెస్టు చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ... ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అంటూ ప్రజలను హింసించే పాలనల పరిపాలిస్తుందని, 420 హామీలను నెరవేర్చకుండా తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ వస్తుంది అని అన్నారు. అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ గత 7, 8 రోజులుగా నిరసన ర్యాలీలు చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్టు చేస్తూ కేసులు పెట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుదామని బిఆర్ఎస్ పార్టీ ఆత్మకూర్ మండల నాయకులు హెచ్చరించారు.

# ముర్రం దూలయ్యకు నివాళు లు



**టీ.మీడియా,సెప్టెంబర్10,చింతూరు** ఉపాధ్యాయ వృత్తిలో తనకంటూ ఒక నిబద్ధత క్రమశిక్షణతో చింతూరు ఏజెన్సీ మన్నె ప్రాంతంలో ఎంతోమందికి విద్యాభ్యాసం అందించిన ముర్రం దూలయ్య మాస్టారు చిత్రపటం వద్ద రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ జిల్లా మండల నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఎర్రం పేట గ్రామంలో ఏర్పాటు చేసిన పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని కిరణ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని చేసుకుంటూ సంఘంలో కూడా చురుకుగా కార్యక్రమాలను నిర్వహించే వారిని తన జీవితకాలం అంతా కూడా ఏజెన్సీ ప్రాంతంలో విద్యను అందించే క్రమంలో నిబద్ధతగా వ్యవహరించారని కొనియాడారు.కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పల్లపు వెంకట్. సీసం సురేష్. మొట్టం రాజయ్య. సున్నం రాజులు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పండ కృష్ణయ్య. సుందరయ్య, సుబ్బారావు, కుటుంబ సభ్యులు ముర్రం రంగమ్మ, కవిత, రవి, ఉపాధ్యాయ సంఘాల వారు బంధువులు పాల్గొన్నారు.

# పీ హెచ్ సి లో ఆశా కార్యకర్తల సమావేశం



**టీ మీడియా, సెప్టెంబర్ 10 ,పెబ్బేరు :** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనీ డాక్టర్ నదియా సదత్ ఎం బి బి ఎస్ గురువారం ఆశా కార్యకర్తల నెలవారి సమావేశం ఎర్పాటు చేశారు డాక్టర్ మాట్లాడుతూ ప్రతీ గర్భిణీ ఏ ఎన్ సీ రిజిస్ట్రేషన్ ఎన్ సి డి స్క్రీనింగ్ ఫాలో అప్ రిపోర్టులు రోజు అప్డేట్ చేయాలనీ డెలివరీ ప్లానింగ్ చేసుకోవాలని సూచించారు ఆరోగ్య విస్తరణ అధికారి దామోదర్ సి హెచ్ వో లీలమ్మా సూపర్వైజర్ పార్వతి హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్ ఏఎన్ఎం లు ఆశా కార్యకర్తలు సిబ్బంది పాల్గోన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం



**● ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు**

**టీ.మీడియా.సెప్టెంబర్10.సూర్యాపేట :**
చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణసాయుద రైతంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు తెలంగాణ సాయుధ పోరాటంలో దొరలకు ఎదురొడ్డి నిలిచి పోరాడిన తొలి మహిళ వీరనారి చాకలి ఐలమ్మ అన్నారు. భూస్వాములు, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా ఉద్యమించేందుకు ఆమె పోరాటం స్ఫూర్తినిచ్చిందన్నారు. ఐలమ్మ పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత నేటి ప్రభుత్వాలపై ఉందన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అదే మనం ఆమెకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డి రాజా, సట్టు నాగయ్య, వెలుగు వనిత, బూర వెంకటేశ్వర్లు, ఎం.డేవిడ్కుమార్, బొమ్మగాని శ్రీనివాస్, పోలెబోయిన కిరణ్, నారబోయిన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి



**● సర్పంచ్ సితారి రమాదేవిలి**

**టీ మీడియా ,సెప్టెంబర్ 10 ,ఆళ్లపల్లి :**
మర్కోడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సితారి రమాదేవి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సితారి రమాదేవి మాట్లాడుతూ... తెలంగాణ సమాజంలో మహిళల చైతన్యానికి, హక్కుల పోరాటానికి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. యూత్ కాంగ్రెస్ నాయకుడు ముప్పారపు రాము మాట్లాడుతూ... నిజాం నవాబుల అరాచకాలను, దొరల పీడనను ఎదురించి "భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం" చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తరతరాలకి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. తన భూమిని, పంటను కాపాడుకోవడానికి దొరల గూండాలను ధైర్యంగా నిలదీసి, కొడవలి చేతబూని వీరనారిలా పోరాడిన ఆమె ధైర్యాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆళ్లపల్లి మండల ఎంపీట స్థానిక నాయకులు సుతారి కృష్ణ ముప్పారపు నరసింహులు గోవర్ధన్ శేఖర్ నవీన్ నాగేష్ రమేష్ సురేష్ కోటేష్ షేక్ పార్విన్ విజయ నాయక్ పాషా కోటమ్మ డేవిడ్ పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాల నిమజ్జనం పైమార్గదర్శకాలు

**● ఏదులాపురం మున్సిపల్ కమిషనర్**

**టి మీడియా, సెప్టెంబర్ 10 , ఖమ్మం రూరల్:**
ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వినాయక నిమజ్జనంపై మున్సిపల్ అధికారులు కీలక నిర్ణయంప్రస్తుతం దేశవ్యాప్తంగా మరియు రాష్ట్రంలో కురుస్తున్న తక్కువ వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం వల్ల స్థానిక జలాశయాలలో నీటి లభ్యత గణనీయంగా తగ్గింది. ఈ తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మున్నేరు కాలువలో నీటి నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ, శాంతిభద్రతల దృష్ట్యా ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి మున్సిపాలిటీ లో నీ వినాయక విగ్రహాలనుఏర్పాటు చేసిన వినాయక ఉత్సవ కమిటీలు, భక్తులు మున్సిపాలిటీ, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. స్థానిక చిన్న కాలువలు, చెరువులు, ఇతర నీటి వనరుల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల



మేరకు, కేవలం నిర్దేశించిన ప్రత్యేక ప్రాంతాలైన ధంసలాపురం వద్ద ఉన్న జలాశయం లేదా తీర్థాల వద్ద ఉన్న జలాశయంలోనే విగ్రహాలను నిమజ్జనం చేయాల్సి ఉంటుంది అని నిమజ్జనం పూర్తయిన తర్వాత ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయే పూజా సామాగ్రి, వ్యర్థాలను తొలగించడంలో మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని అధికారులకి విజ్ఞప్తి చేశారు.

# పోలవరం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి: ఐద్వా



**టీ.మీడియా,సెప్టెంబర్10,.చింతూరు:**
అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ సమావేశం కారం లక్ష్మీ అధ్యక్షతన చింతూరు లో జరిగింది.ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ. పద్మావతి మాట్లాడుతూ... పోలవరం జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని, వెంటనే ప్రభుత్వం కరువు జిల్లాగా ప్రకటించి, రైతులను, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సోడే రమాదేవి, నూనె అశ్విని, దారమ్మ, బుచ్చమ్మ, సీతమ్మ, స్వరూప, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా కోరల్లో 'సుబ్బయ్యకుంట' చెరువు శిఖం..?






**● సర్వే నంబర్ 171లో పై ఏ ఆరోపణలు**

**● కరెంట్ స్తంభాలు, విద్యుత్ మీటర్లు ఎలా వచ్చాయి..?**

**టీ మీడియా,సెప్టెంబర్10,సింగరేణి (కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని సర్వే నంబర్ 171లో ఉన్న సుబ్బయ్యకుంట చెరువు శిఖం భూమి కబ్జా కోరల్లో చిక్కుకుంటోందనే ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. చెరువుకు సంబంధించిన శిఖం భూమిని కొంతమంది ఆక్రమించి, ప్లాట్ల తరహాలో మార్చేందుకు ప్రయత్నిస్తున్నారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.చెరువు భూమిని పరిరక్షించాల్సిన సంబంధిత శాఖల అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.ముఖ్యంగా సర్వే నంబర్ 171లో చెరువు శిఖం పరిధిగా చెబుతున్న ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు కావడం,విద్యుత్ మీటర్లు రావడం,ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నట్లు ఆరోపణలు రావడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు సర్వే నంబర్ 171 రెవెన్యూ రికార్డుల్లో ఏ విధంగా నమోదై ఉంది? అందులో చెరువుకు సంబంధించిన విస్తీర్ణం ఎంత? శిఖం భూమి హద్దులు ఎక్కడి వరకు ఉన్నాయి? ప్రస్తుతం ఎంత భూమి అందుబాటులో ఉంది? అనే వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**చెరువు భూమిలో కరెంట్ స్తంభాలు ఎలా వచ్చాయి..?**

సర్వే నంబర్ 171లో చెరువు శిఖం పరిధిలోనే నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు నిజమైతే వాటికి అనుమతులు ఎలా వచ్చాయనేది ప్రధాన ప్రశ్నగా మారింది.విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేసే ముందు భూమికి సంబంధించిన వివరాలను పరిశీలించారా?విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే సమయంలో అవసరమైన పత్రాలను తనిఖీ చేశారా?పంచాయతీ నుంచి ఇంటి నిర్మాణ అనుమతులు ఉంటే అవి ఏ ప్రాతిపదికన ఇచ్చారు? అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది.

**ప్లాట్లుగా మార్చేందుకు ప్రయత్నమా..?**

సుబ్బయ్యకుంట చెరువుకు సంబంధించిన సర్వే నంబర్ 171లోని శిఖం భూమిని కొంతమంది ప్లాట్ల మాదిరిగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఈ ఆరోపణల్లో వాస్తవమెంతో రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి తేల్చాల్సి ఉంది.ఆక్రమణలు ఉన్నట్లు తేలితే వాటిని గుర్తించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికారుల మధ్య సమన్వయం లేదా..?**

ఒకవైపు చెరువు భూమి కబ్జాకు గురవుతోందనే ఆరోపణలు వస్తుంటే మరోవైపు అదే ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు, మీటర్లు, నిర్మాణాలకు సంబంధించిన వ్యవహారాలు ఎలా ముందుకు సాగుతున్నాయనే ప్రశ్న తలెత్తుతోంది. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్ శాఖల్లో ఏ శాఖ ఏం పరిశీలించింది? ఎవరు అనుమతించారు? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గ్రామస్తులు అంటున్నారు.

**171లో ఇప్పటికైనా సర్వే చేస్తారా..?**

సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సర్వే నంబర్ 171కు సంబంధించిన పాత,ప్రస్తుత రెవెన్యూ రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.సుబ్బయ్యకుంట చెరువు పూర్తి విస్తీర్ణం,శిఖం హద్దులను అధికారికంగా నిర్ధారించి హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.శిఖం భూమిలో నిర్మాణాలు,విద్యుత్ కనెక్షన్లు లేదా ఇతర అనుమతులు ఉన్నట్లయితే వాటి చట్టబద్ధతను కూడా పరిశీలించాలని కోరుతున్నారు. చెరువులను కాపాడాల్సిన అధికారుల కళ్లముందే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయనే ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. సర్వే నంబర్ 171లో అధికారులు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి నిజానిజాలను బయటపెడతారా..?చెరువు శిఖం హద్దులను తేల్చి ఆక్రమణలు ఉన్నట్లు నిర్ధారణైతే తొలగిస్తారా..?అనుమతులు ఇచ్చిన తీరుపైనా విచారణ జరుపుతారా..? ఫిర్యాదులు వచ్చే వరకు మౌనంగానే ఉంటారా..? అన్నది వేచి చూడాల్సిందే.

# ఆత్మ ఆధ్వర్యంలో ఆర్ పి ల్ శిక్షణ కార్యక్రమం

**టి మీడియా , సెప్టెంబర్ 10 , ఖమ్మం రూరల్:**
ఆత్మ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ముత్తగూడెం రైతువేదిక నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ ఈ. రాజేశ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటల సాగు, పంటల రక్షణ చర్యలు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంటలను రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.కేవీకే శాస్త్రవేత్తలు రైతులకు సహజ వ్యవసాయ పై అవగాహన కల్పించడం జరిగింది. సహజ వ్యవసాయంలో భాగంగా సస్య రక్షణ చర్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడం జరిగింది. అదేవిధంగా జీవన ఎరువుల ప్రాముఖ్యత, నీమాస్త్రం, బీజామృతం, ద్రవ బీజామృతం, బ్రహ్మాస్త్రం ల పనితీరు పై రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం రైతు శిక్షణా కేంద్రం నిర్వాహకులు, అగ్రికల్చర్ ఆఫీసర్ వి. భాస్కర్ మాట్లాడుతూ ఎల్‌నినో నేపథ్యంలో పంటల రక్షణ చర్యలు, ప్రత్యామ్నాయ పంటలు మరియు



వాటి సాగు పై విపులంగా రైతులకు వివరించడం జరిగింది. నియోజకవర్గ ఉద్యానవన అధికారి మాట్లాడుతూ ఉద్యానవన శాఖకు సంబంధించి రాయితీ వివరాలను రైతులకు వివరించడం జరిగింది. ఎల్ నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ కూరగాయల పంటల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. చివరగా సహాయ వ్యవసాయ సంచాలకులు ఈ. రాజేశ్ మాట్లాడుతూ రైతులు పంటల నమోదు ప్రక్రియను ఆన్‌లైన్‌లో సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎ ఓ శ్రీ ఉమా నరేష్ గారు, ఏ ఇ ఓ లు, కేవీకే శాస్త్రవేత్తలు, అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీ వి. భాస్కర్ , వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 15 బాక్సుల సిరంజీల విరాళం

**● సింగరేణి మండల మెడికల్ అసోసియేషన్ సేవా కార్యక్రమం**

**టీ మీడియా,సెప్టెంబర్10,సింగరేణి (కారేపల్లి):**
సింగరేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సింగరేణి మండల మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం 15 బాక్సుల సిరంజీలను విరాళంగా అందజేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమవంతు సహకారంగా వీటిని అందించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఓరుగంటి రంగనాథ్,ఉపాధ్యక్షుడు అనంతారపు వెంకటాచారి,సలహాదారు సూర్యదేవర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్య సిబ్బందికి తమ సహకారం కొనసాగుతుందని తెలిపారు.ఈ



కార్యక్రమంలో సభ్యులు వెంకట్, పి.శ్రీను, రాముతో పాటు చీమలపాడు, బాజుమల్లాయిగూడెం, మాదారం, గాదెపాడు, మాణిక్యారం, భాగ్యనగర్ తండా తదితర గ్రామాలకు చెందిన మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అధ్యాపకుల నియామకం

**టీ.మీడియా,సెప్టెంబర్10,చింతూరు :**
చింతూరులోని ప్రభుత్వడిగ్రీ,కళాశాలలో ఇంగ్లీష్,మ్యాథమెటిక్స్,కెమిస్ట్రీ, జువాలజీ, సబ్జెక్టులలో ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికైన నలుగురు అధ్యాపకులు నూతనంగా విధుల్లో చేరారు. ఏపీపీఎస్సీ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచి వీరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులుగా ఎంపికయ్యారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్. మణిమాల మాట్లాడుతూ కొత్తగా అధ్యాపకుల నియామకంతో కళాశాలలో బోధన సిబ్బంది బలోపేతం అవుతుందని, విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. అధ్యాపకులు తమ బోధనా అనుభవం నైపుణ్యాలతో, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని



ఆకాంక్షించారు. కొత్తగా విధుల్లో చేరిన అధ్యాపకులకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.